క్లుప్తంగా

దివ్యాంగులకు రుణాలు

భానుపురి (సూర్యాపేట) : దివ్యాంగుల జీవనోపాధికి ఆర్థిక ప్రోత్సాహక పథకం కింద రుణాలు అందించనున్నట్లు జిల్లా సంక్షేమ అధికారి ప్రకటనలో తెలిపారు. వందశాతం రాయితీతో రూ.50వేల నుంచి రూ.2లక్షల వరకు 22 యూనిట్లు మంజూరు చేయనున్నట్లు పేర్కొన్నారు. దివ్యాంగులు tgobmms.cgg.gov.in వెబ్ సైట్‌లో ఈ నెల 31లోగా దరఖాస్తు చేసుకోవాలని సూచించారు.

బంద్‌కు పీవైఎల్ మద్దతు

సూర్యాపేట అర్బన్ : విద్యారంగ సమస్యల పరిష్కారం కోసం బుధవారం నిర్వహించే విద్యాసంస్థల బంద్‌కు పీవైఎల్ మద్దతు తెలుపుతున్నట్లు ప్రగతిశీల యువజన సంఘం (పీవైఎల్) జిల్లా అధ్యక్షుడు నల్లగొండ నాగయ్య తెలిపారు. మంగళవారం ఆయన విలేకరులతో మాట్లాడారు. పదేళ్ల పాలనలో బీఆర్‌ఎస్ ప్రభుత్వం విద్యారంగాన్ని పూర్తిగా విస్మరించిందని ఆరోపించారు. ప్రస్తుత కాంగ్రెస్ ప్రభుత్వం విద్యారంగ సమస్యలను పరిష్కరించాలని డిమాండ్ చేశారు.

సభ్యత్వ నమోదు

తుంగతుర్తి : ఉపాధ్యాయుల సంక్షేమమే లక్ష్యంగా తపస్ పనిచేస్తోందని తెలంగాణ ప్రాంత ఉపాధ్యాయ సంఘం జిల్లా అధ్యక్షులు పర్వతం సంధ్యారాణి అన్నారు. మంగళవారం మండల పరిధిలోని వివిధ పాఠశాలల్లో ఉపాధ్యాయుల సభ్యత్వ నమోదు నిర్వహించి మాట్లాడారు. కార్యక్రమంలో సంఘం జిల్లా బాధ్యుడు గుండు ఆంజనేయులు, మండల అధ్యక్షుడు గుర్రం పాపిరెడ్డి, ప్రధాన కార్యదర్శి పిన్నపురెడ్డి కార్తీక్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

కులం పేరుతో వేధిస్తున్న వారిపై చర్య తీసుకోవాలి

సూర్యాపేట : సూర్యాపేట మున్సిపాలిటీ మెప్మా కోఆర్డినేటర్ శ్వేతను కులం పేరుతో దూషిస్తూ, సోషల్ మీడియా ద్వారా తప్పుడు ఆరోపణలు చేస్తున్న వారిపై చర్యలు తీసుకోవాలని మాదిగ మహిళా సమైక్య జిల్లా అధ్యక్షురాలు మారపల్లి సావిత్ర మాదిగ, పట్టణ అధ్యక్షురాలు పిడమర్తి నాగేశ్వరి మాదిగ అన్నారు. మంగళవారం పట్టణంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడారు. మెప్మాలో ఎస్సీ మహిళా ఉద్యోగి శ్వేతపై కొంతమంది కావాలనే అనేక ఆరోపణలు చేస్తూ, కులం పేరుతో దూషిస్తూ మానసిక వేదనకు గురిచేస్తున్నారని తెలిపారు. ఈ కార్యక్రమంలో మహిళా సంఘాల ఆర్పీలు అన్నపర్తి రాణి, కోల మంగ, నూకల విజయ, గోన విజయ, మంత్రాల పద్మ, రేణుక, జాస్మిన్, మనీ, కవిత, నాగమణి, నూర్ జాన్ పాల్గొన్నారు.

చెక్కుల పంపిణీ



చెక్కులు పంపిణీ చేస్తున్న నాయకులు

భానుపురి : సీఎం సహాయ నిధి పేదలకు ఆసరాగా నిలుస్తోందని ఏఐసీసీ సభ్యుడు రాంరెడ్డి సర్వోత్తమ్ రెడ్డి, వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ కొప్పుల వేణారెడ్డి అన్నారు. మంగళవారం జిల్లా కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో రూ.9లక్షల విలువైన 27 సీఎంఆర్‌ఎఫ్ చెక్కులను లబ్ధిదారులకు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో పార్టీ నాయకులు పాల్గొన్నారు.

విద్యార్థులను ప్రోత్సహించాలి

పెన్‌పహాడ్ : టెక్నాలజీతో సమాజానికి ఉపయోగపడే కొత్త ఆవిష్కరణలు చేసేలా విద్యార్థులను ప్రోత్సహించాలని ప్రిన్సిపాల్ కోడి లింగయ్య, కోర్సు డైరెక్టర్ జనార్దన్ అన్నారు. మంగళవారం మండల పరిధిలోని అనాజీపురం పీఎంశ్రీ ఆదర్శ పాఠశాలలో సూర్యాపేట, తుంగతుర్తి నియోజకవర్గాల పరిధిలోని 9 పీఎంశ్రీ పాఠశాలలకు చెందిన అటల్ టింకరింగ్ ల్యాబ్ ఉపాధ్యాయులకు రెండు రోజుల పాటు నిర్వహించే శిక్షణ తరగతులను ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో రీసోర్స్ పర్సన్‌లు కిరణ్, షంషాద్ తదితరులు పాల్గొన్నారు.

ఇళ్లు ఇవ్వాలని వినతి

చివ్వెంల : అర్హులైన పేదలందరికీ ఇళ్ల పట్టాలిచ్చి, ఇందిరమ్మ ఇళ్లు మంజూరు చేయాలని కోరుతూ సీపీఐ (ఎంఎల్) మాస్‌లైన్ ఆధ్వర్యంలో కుడకుడ గ్రామ శివారులోని ప్రభుత్వ భూమిలో గుడిసెలు వేసుకున్న పేదలు మంగళవారం తహసీల్దార్ ప్రకాశ్‌రావుకు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆ పార్టీ జిల్లా కార్యదర్శి కొత్తపల్లి శివకుమార్ మాట్లాడారు. గత 6 సంవత్సరాల నుంచి కుడకుడ గ్రామ శివారులోని ప్రభుత్వ భూమిలో పేదలు గుడిసెలు వేసుకుని జీవిస్తున్నారని తెలిపారు. వారికి శాశ్వత పట్టాలు ఇచ్చి, ఇందిరమ్మ ఇళ్లు మంజూరు చేయాలని పలుమార్లు మంత్రులకు, కలెక్టర్‌కు విజ్ఞప్తి చేసినట్లు పేర్కొన్నారు. ఈ విషయంపై స్పందించిన కలెక్టర్ గత నెల 27న విచారణ జరపాలని ఆదేశించారని, కానీ అధికారులు ఇంతవరకు పట్టించుకోవడంలేదని తెలిపారు. ఈ కార్యక్రమంలో పీఓడబ్ల్యూ జిల్లా కార్యదర్శి కొత్తపల్లి రేణుక, పీడీఎస్‌యూ రాష్ట్ర ఉపాధ్యక్షుడు ఎర్ర అఖిల్, పేర్ల నాగన్న, గొడ్డలి నర్సన్న, గులాం, జానయ్య, చంద్రకళ, జయమ్మ, పద్మ, కల్పన, తదితరులు పాల్గొన్నారు.



వినతిపత్రం అందజేస్తున్న నాయకులు

ప్రమాదకరంగా ట్రాన్స్‌ఫార్మర్లు



తుంగతుర్తిలోని మెయిన్ రోడ్డు పక్కన ప్రమాదకరంగా ఉన్న విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్



తుంగతుర్తిలో చెట్ల పొదల మధ్య..

- రక్షణ కంచెల ఏర్పాటులో నిర్లక్ష్యం
- మూగ జీవాలు మృత్యువాత పడుతున్నా పట్టించుకోని విద్యుత్ అధికారులు

తుంగతుర్తి : విద్యుత్ అధికారుల నిర్లక్ష్యం కారణంగా మండలంలోని ఆయా గ్రామాల ప్రజలు తీవ్ర ఆందోళన చెందుతున్నారు. ట్రాన్స్‌ఫార్మర్లకు రక్షణ వలయాలు లేకపోవడంతో తరచుగా మూగ జీవాలు విద్యుదాఘాతానికి గురై మరణిస్తున్నాయి. మండల కేంద్రంలో ఆరు 100 కేవీ, ఒక 63 కేవీ ట్రాన్స్‌ఫార్మర్లు ఉన్నాయి. అలాగే, 24 గ్రామ పంచాయతీలలో 38, 73 కేవీ, 56 సింగిల్ ఫేజ్ ట్రాన్స్‌ఫార్మర్ల ద్వారా ప్రజలకు విద్యుత్ సరఫరా అవుతోంది. అయితే, వీటిలో మండల కేంద్రంలోని రెండు ట్రాన్స్‌ఫార్మర్లకు మాత్రమే రక్షణ వలయాలు ఏర్పాటు చేశారు. మిగిలిన ట్రాన్స్‌ఫార్మర్లకు ఎటువంటి రక్షణ వలయాలు లేకపోవడం ఆందోళన కలిగిస్తోంది. దీనివల్ల నిత్యం మూగజీవాలు విద్యుదాఘాతానికి గురై ప్రాణాలు కోల్పోతున్నాయి. అధికారులు ఇప్పటికైనా స్పందించి, అన్ని ట్రాన్స్‌ఫార్మర్ల చుట్టూ రక్షణ వలయాలు ఏర్పాటు చేయాలని, అలాగే ప్రతి ట్రాన్స్‌ఫార్మర్ వద్ద ఏబీ స్విచ్‌లను ఏర్పాటు చేసి మూగజీవాల ప్రాణాలను కాపాడాలని స్థానికులు కోరుతున్నారు. ఈ సమస్యపై తక్షణమే చర్యలు తీసుకోకపోతే పెద్ద ప్రమాదాలు జరిగే అవకాశం ఉందని ప్రజలు భయపడుతున్నారు.

రక్షణ గోడలు నిర్మించాలి



మండల పరిధిలోని చాలా గ్రామాలలో విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్లకు రక్షణ వలయాలు లేవు. దీంతో ఎప్పుడు ఏ ప్రమాదం జరుగుతుందో తెలియని పరిస్థితి నెలకొంది. ఇప్పటికే పెద్దసంఖ్యలో మూగజీవాలు మృత్యువాత పడిన సంఘటనలు ఉన్నాయి. అధికారులు చర్యలు చేపట్టి ట్రాన్స్‌ఫార్మర్లకు రక్షణ వలయాలు ఏర్పాటు చేయాలి.

– నారాయణదాసు నాగరాజు, తుంగతుర్తి

పనిచేసిన ప్రతి కార్యకర్తకు గుర్తింపు



మాట్లాడుతున్న ఏఐసీసీ కార్యదర్శి సంపత్‌కుమార్

- ఏఐసీసీ కార్యదర్శి సంపత్‌కుమార్

తిరుమలగిరి : కాంగ్రెస్ పార్టీలో పనిచేసిన ప్రతి కార్యకర్తకు గుర్తింపు ఉంటుందని.. రాబోయే స్థానిక సంస్థల ఎన్నికలు, నామినేటెడ్ పదవుల్లో తప్పక అవకాశం వస్తుందని ఏఐసీసీ కార్యదర్శి సంపత్ కుమార్ పేర్కొన్నారు. మంగళవారం తిరుమలగిరిలో నిర్వహించిన కాంగ్రెస్ పార్టీ తుంగతుర్తి నియోజకవర్గ ముఖ్య నాయకుల సమావేశంలో ఆయన మాట్లాడారు. పార్టీలేనిదే ప్రభుత్వం లేదని, పార్టీ సంస్థాగతంగా బలోపేతం కావాలంటే ప్రభుత్వం చేపట్టిన సంక్షేమ పథకాలను ప్రజల్లోకి తీసుకెళ్లాల్సిన బాధ్యత నాయకులు, కార్యకర్తల పైన ఉందని గుర్తు చేశారు. 29 రాష్ట్రాల్లో ఎక్కడా లేనివిధంగా ఇన్ని సంక్షేమ పథకాలు అందించిన ఘనత రాష్ట్ర ప్రభుత్వానిదే అని అన్నారు. గత బీఆర్‌ఎస్ ప్రభుత్వం హయాంలో కుటుంబ, అరాచక, నియంతృత్వ పాలన సాగిందని ఆరోపించారు. రాబోయే స్థానిక సంస్థల ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ అభ్యర్థులంతా విజయం సాధించేలా పాటుపడాలన్నారు. సమావేశంలో తుంగతుర్తి ఎమ్మెల్యే మందుల సామేల్, డీసీసీ అధ్యక్షుడు చెవిటి వెంకన్న యాదవ్, మహిళా కాంగ్రెస్ జిల్లా అధ్యక్షురాలు అనురాధ, గుడిపాటి నరసయ్య, వై. నరేష్, పేరాల వీరేష్, జమీలాల్, పాలెపు చంద్రశేఖర్, వివిధ మండలాల పార్టీ అధ్యక్షులు, నాయకులు, తదితరులు పాల్గొన్నారు.

ఏఐసీసీ అధ్యక్షుడు ఖర్గేను కలిసిన రేఖ



న్యూఢిల్లీలో ఏఐసీసీ అధ్యక్షుడు మల్లిఖార్జున ఖర్గేకు పుష్పగుచ్ఛం ఇస్తున్న బోయలపల్లి రేఖ

అర్వపల్లి : ఏఐసీసీ అధ్యక్షుడు మల్లిఖార్జున ఖర్గేను మంగళవారం న్యూఢిల్లీలోని ఆయన నివాసంలో మహిళా కాంగ్రెస్ రాష్ట్ర ఉపాధ్యక్షురాలు డాక్టర్ బోయలపల్లి రేఖ కలిసి పుష్పగుచ్ఛం అందజేశారు. అలాగే జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు. అనంతరం ఆమె మాట్లాడారు. దేశంలో ప్రజాస్వామ్య రక్షణ కోసం మల్లిఖార్జున ఖర్గే చేస్తున్న పోరాటం ప్రతి కార్యకర్తకు ప్రేరణ అని అన్నారు. ఆయన నేతృత్వం దేశానికి మరింత బలాన్నిస్తుందని పేర్కొన్నారు. అనంతరం మహిళలపై జరుగుతున్న దాడులకు వ్యతిరేకంగా ఆలిండియా మహిళా కాంగ్రెస్ అధ్యక్షురాలు అల్కా లాంబ, రాష్ట్ర మహిళా కాంగ్రెస్ అధ్యక్షురాలు సునీతారావుల ఆధ్వర్యంలో న్యూఢిల్లీలోని 24 అక్బర్ రోడ్డు వద్ద నిరసన కార్యక్రమం చేపట్టారు. ఈ కార్యక్రమంలో మహిళా సంఘం నాయకులు, తదితరులు పాల్గొన్నారు.

బాధిత కుటుంబాలకు పరామర్శ



నాగారం : వర్ధమానుకోటలో మేడి నర్సయ్య కుటుంబాన్ని పరామర్శిస్తున్న గాదరి కిషోర్

నాగారం : వర్ధమానుకోట గ్రామానికి చెందిన బీఆర్ఎస్ సీనియర్ నాయకుడు మేడి మల్లేష్ తండ్రి మేడి నర్సయ్య, అలాగే గ్రామానికి చెందిన సిద్ధం పిచ్చమ్మ ఇటీవల అనారోగ్యం మృతి చెందారు. ఈ సందర్భంగా మాజీ ఎమ్మెల్యే గాదరి కిషోర్‌కుమార్ మంగళవారం మృతుల చిత్రపటాలకు పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం కుటుంబ సభ్యులను పరామర్శించారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు కల్లెట్లపల్లి ఉప్పలయ్య, మాజీ మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్లు గుండగాని అంబయ్య, యారాల రాంరెడ్డి, మాజీ ఎంపీపీ కూరం మణివెంకన్న, నాయకులు ఈదుల కిరణ్, ఈరేటి అంజయ్య, దోమల బాలమల్లు, కన్నెబోయిన మల్లేష్, తదితరులు పాల్గొన్నారు.

అర్వపల్లి : జాజిరెడ్డిగూడెం పీఏసీఎస్ డైరెక్టర్ పెద్ది శ్రీనివాస్ తల్లి రమణమ్మ ఇటీవల అనారోగ్యంతో మరణించారు. మంగళవారం మృతురాలి చిత్రపటానికి తుంగతుర్తి మాజీ ఎమ్మెల్యే గాదరి కిషోర్‌కుమార్ నివాళులర్పించారు. అనంతరం కుటుంబ సభ్యులను పరామర్శించారు. నివాళులర్పించిన వారిలో బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు గుండగాని సోమేష్‌గౌడ్, జిల్లా నాయకుడు మొరిశెట్టి ఉపేందర్, కొప్పుల సోమిరెడ్డి, పున్న హరిప్రసాద్, కోటమర్తి మల్లయ్య, యాదయ్య, వెంకన్న, నాగరాజు, శేఖర్, ఎల్.నాగరాజు, కె.నాగరాజు, ఎం.రమేష్, బి.వెంకన్న, నవీన్, నాగరాజు, రామ్మూర్తి ఉన్నారు.

నూతనకల్ : మండల పరిధిలోని వివిధ గ్రామాల్లో ఇటీవల మృతి చెందిన బీఆర్ఎస్ కార్యకర్తల కుటుంబాలను మాజీ ఎమ్మెల్యే గాదరి కిషోర్‌కుమార్ మంగళవారం పరామర్శించారు. తాళ్లసింగారం గ్రామానికి చెందిన రైతు సమన్వయ సమితి కో ఆర్డినేటర్ గుండు లింగయ్య, యడవెల్లి గ్రామానికి చెందిన బొడ్డు భద్రమ్మ, పిట్టల సూర్యకుమార్, మాజీ సర్పంచ్, మార్కెట్ కమిటీ మాజీ డైరెక్టర్ గాజుల వెంకటయ్యల కుటుంబాలతో పాటు మండల కేంద్రంలోని కనకటి లక్ష్మయ్య, లింగంపల్లి గ్రామానికి చెందిన కొరివి వీరయ్యల కుటుంబాలను పరామర్శించారు. అనంతరం సూర్యాపేటలో మాజీ ఎంపీపీ గోరుగంటి మోహన్‌రావు చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు మున్నా మల్లయ్య, ఎస్‌ఏ రజాక్, మాజీ జెడ్పీటీసీ గుగులోతు నర్సింగ్ నాయక్, గాజుల తిర్మల్‌రావు పాల్గొన్నారు.

చిరస్మరణీయుడు దాశరథి కృష్ణమాచార్యులు



సూర్యాపేట : కృష్ణమాచార్యుల చిత్రపటానికి నివాళులర్పిస్తున్న న్యాయవాది, నాయకులు



తుంగతుర్తిలో దాశరథి చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పిస్తున్న బీఆర్‌ఎస్ నాయకులు

సూర్యాపేట : నా తెలంగాణ కోటి రత్నాలవీణ అనే నినాదంతో ప్రజలలో తెలంగాణ స్ఫూర్తిని జ్వలింపజేసిన మహనీయుడు దాశరథి కృష్ణమాచార్యులు అని, ప్రజల హృదయాల్లో ఆయన చిరస్మరణీయుడిగా ఉంటాడని పూర్వ అదనపు పబ్లిక్ ప్రాసిక్యూటర్, సీనియర్ న్యాయవాది జె. శశిధర్ అన్నారు. మంగళవారం దాశరథి కృష్ణమాచార్యుల జయంతి సందర్భంగా వివేక ఫౌండేషన్ ఆధ్వర్యంలో పట్టణ పరిధిలోని స్పందన డిగ్రీ కళాశాలలో నిర్వహించిన కార్యక్రమంలో ఆయన పాల్గొని మాట్లాడారు. కార్యక్రమంలో వివేక ఫౌండేషన్ అధ్యక్షుడు తీకుళ్ల సాయిరెడ్డి, స్పందన డిగ్రీ కళాశాల డైరెక్టర్లు అచ్యుతరామశర్మ, తీగల వేణు, వివేక ఫౌండేషన్ ఉపాధ్యక్షులు శేరి శ్రీనివాస్ రెడ్డి, నాగిరెడ్డి, భాషపంగు సునీల్, ధనుంజయ చారి, అశోక్ తదితరులు పాల్గొన్నారు.

ఆశయాల సాధనకు కృషి చేయాలి

తుంగతుర్తి : మహాకవి దాశరథి కృష్ణమాచార్యుల ఆశయ సాధనకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలని బీఆర్‌ఎస్ మండల అధ్యక్షుడు తాటికొండ సీతయ్య అన్నారు. మంగళవారం దాశరథి కృష్ణమాచార్య శత జయంతి సందర్భంగా మండల కేంద్రంలోని బీఆర్ఎస్ పార్టీ కార్యాలయంలో ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో బీఆర్‌ఎస్ నాయకులు గుండగాని రాములు గౌడ్, గోపగాని రమేష్ గౌడ్, తునికి సాయిలు గౌడ్, కొండగడుపుల నాగయ్య తదితరులు పాల్గొన్నారు.

వర్షాకాలం దృష్ట్యా అప్రమత్తంగా ఉండాలి

పెన్‌పహాడ్ : వర్షాకాలం నేపథ్యంలో మండలంలో అన్ని శాఖల అధికారులు అప్రమత్తంగా ఉండాలని తహసీల్దార్ లాలు అన్నారు. మంగళవారం తహసీల్దార్ కార్యాలయంలో అన్ని శాఖల అధికారులతో సమావేశం నిర్వహించారు. గ్రామాల్లోని చెరువుల్లో నీటి నిల్వలు, కట్టల సామర్థ్యాలను పరిశీలించాలన్నారు. రైతులకు యూరియా కొరత లేకుండా చర్యలు చేపట్టాలని సూచించారు. కార్యక్రమంలో ఎస్‌ఐ గోపికృష్ణ, మండల వైద్యాధికారి స్రవంతి, ఏఓ అనిల్‌కుమార్, ఐబీ ఏఈ లింగయ్య, పీఆర్‌ఏఈ శ్రీకాంత్‌రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

ఆత్మకూర్ (ఎస్) : వర్షాకాలం నేపథ్యంలో సీజనల్ వ్యాధులు ప్రబలకుండా అన్ని శాఖల అధికారులు సమన్వయంతో ముందుకెళ్లాలని మండల ప్రత్యేక అధికారి శ్రీనివాస్ అన్నారు. మంగళవారం మండల పరిషత్ కార్యాలయంలో నిర్వహించిన అన్ని శాఖల అధికారుల సమావేశంలో ఆయన మాట్లాడారు. కార్యక్రమంలో ఎంపీడీఓ హసీమ్, మండల వైద్యాధికారి మౌనిక, పంచాయతీరాజ్ ఏఈ రాహుల్, ఇరిగేషన్ అధికారి చరణ్, వివిధ శాఖల అధికారులు, పంచాయతీ కార్యదర్శులు పాల్గొన్నారు.

నూతనకల్ : గ్రామాల్లో సమస్యల పరిష్కారం కోసం సంబంధిత అధికారులు ముందస్తు చర్యలు చేపట్టాలని తహసీల్దార్ శ్రీనివాసరావు అన్నారు. మంగళవారం తహసీల్దార్ కార్యాలయంలో అన్ని శాఖల అధికారులకు నిర్వహించిన అవగాహన సదస్సులో ఆయన పాల్గొని మాట్లాడారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీఓ సునీత, ఎంపీఓ శశికళ, ఎస్‌ఐ ప్రవీణ్‌కుమార్, మండల వ్యవసాయ అధికారి మురళీబాబు, వైద్యసిబ్బంది పాల్గొన్నారు.

చివ్వెంల : వర్షాకాలం నేపథ్యంలో అధికారులు అప్రమత్తంగా ఉండాలని తహసీల్దార్ ప్రకాశ్‌రావు అన్నారు. కలెక్టర్ ఆదేశాల మేరకు మంగళవారం తహసీల్దార్ కార్యాలయంలో నిర్వహించిన మండలస్థాయి అధికారుల సమీక్షా సమావేశంలో ఆయన మాట్లాడారు. రాబోయే మూడు నెలలు ఎటువంటి ప్రకృతి విపత్తులు వచ్చినా వాటిని సమర్థవంతంగా ఎదుర్కొనేందుకు సిద్ధంగా ఉండాలని అన్నారు. సహాయక చర్యలకు అప్రమత్తంగా ఉండాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీఓ సంతోష్ కుమార్, వైద్యాధికారి భవాని, పశు వైద్యాధికారి సంతోష్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

గ్రామాల అభివృద్ధే ప్రభుత్వ ధ్యేయం



నాగారం : పసునూర్‌లో జీపీ భవన నిర్మాణానికి శంకుస్థాపన చేస్తున్న ఎమ్మెల్యే సామేల్



తిరుమలగిరి జూనియర్ కళాశాల ప్రిన్సిపాల్‌కు రూ.50వేల నగదును అందజేస్తున్న ఎమ్మెల్యే

- ఎమ్మెల్యే మందుల సామేల్

నాగారం : గ్రామాల అభివృద్ధే కాంగ్రెస్ ప్రభుత్వ ధ్యేయమని ఎమ్మెల్యే మందుల సామేల్ అన్నారు. మంగళవారం ఫణిగిరి గ్రామంలో ఎన్ఆర్ఈజీఎస్ నిధులు రూ.70లక్షలతో సీసీరోడ్ల పనులు, పసునూర్ గ్రామంలో ఎన్ఆర్ఈజీఎస్ నిధులు రూ.20 లక్షలతో గ్రామ పంచాయతీ భవన నిర్మాణ పనులకు శంకుస్థాపన చేశారు. అలాగే నాగారం, మాచిరెడ్డిపల్లి గ్రామాల్లో ఒక్కో భవనానికి రూ.12 లక్షల చొప్పున అంగన్వాడీ భవనాల నిర్మాణానికి శంకుస్థాపన చేశారు. అనంతరం పసునూరులో మల్లేపాక శ్రీను కుమార్తె మల్లేపాక శ్రీజ ఉన్నత చదువుల కోసం రూ.25 వేల ఆర్థికసాయం అందజేశారు. ఈ కార్యక్రమంలో తిరుమలగిరి మార్కెట్ కమిటీ చైర్‌పర్సన్ ఎల్సొజు చామంతి నరేష్, పీఏసీఎస్ చైర్మన్ పాలేపు చంద్రశేఖర్, కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు తొడుసు లింగయ్య, తదితరులు పాల్గొన్నారు.

మద్దిరాల : మండల కేంద్రానికి చెందిన భూతం అవిలమ్మ ఇటీవల అనారోగ్యం కారణంగా సీఎం రిలీఫ్ ఫండ్‌కు దరఖాస్తు చేసుకుంది. దీంతో ఆమెకు రూ.56వేలు మంజూరు కాగా ఆ చెక్కును మంగళవారం తిరుమలగిరిలోని క్యాంపు కార్యాలయంలో లబ్ధిదారులకు ఎమ్మెల్యే సామేల్ అందజేశారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు ముక్కాల అవిలమల్లు యాదవ్, చామకూరి శ్రీనివాస్, ఎల్లు అశోక్‌రెడ్డి, వల్లపు రమేష్ పాల్గొన్నారు.

ఉత్తమ ఫలితాలు సాధించాలి

తిరుమలగిరి : ప్రభుత్వ జూనియర్ కళాశాలలో విద్యార్థుల సంఖ్యను పెంచి, ఉత్తమ ఫలితాలు సాధించాలని ఎమ్మెల్యే మందుల సామేల్ అన్నారు. మంగళవారం క్యాంపు కార్యాలయంలో ఆయనను తిరుమలగిరి ప్రభుత్వ జూనియర్ కళాశాల నూతన ప్రిన్సిపాల్ బచ్చలకూర మృత్యుంజయ, కళాశాల అధ్యాపకులు కలిశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే వారితో మాట్లాడారు. కళాశాల అభివృద్ధికి కృషి చేస్తానని తెలిపారు. కళాశాలలో మౌలిక వసతుల కల్పనకు వ్యక్తిగతంగా రూ.50వేలను కళాశాల ప్రిన్సిపాల్‌కు అందజేశారు. ఈ కార్యక్రమంలో సూర్యాపేట జిల్లా కాంగ్రెస్ కమిటీ అధ్యక్షుడు చెవిటి వెంకన్నయాదవ్, తిరుమలగిరి వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్‌పర్సన్ యల్సొజు చామంతి నరేష్ పాల్గొన్నారు.

వార్డుల్లో సమస్యల పరిష్కారమే లక్ష్యం



మాట్లాడుతున్న కమిషనర్ హనుమంత రెడ్డి



సూర్యాపేట : సంచిని కొనుగోలు చేస్తున్న మున్సిపల్ కమిషనర్ హనుమంత రెడ్డి

- మున్సిపల్ కమిషనర్ హనుమంత రెడ్డి

సూర్యాపేట : వార్డుల్లో సమస్యల పరిష్కారమే లక్ష్యంగా చర్యలు తీసుకుంటున్నామని మున్సిపల్ కమిషనర్ హనుమంత రెడ్డి అన్నారు. 100 రోజుల పట్టణ ప్రగతి ప్రణాళికలో భాగంగా మంగళవారం 43వ వార్డులో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. అభివృద్ధిలో ప్రజల భాగస్వామ్యం కీలకమని తెలిపారు. పారిశుద్ధ్యం, తాగునీటి సరఫరా, డ్రెయినేజీ సమస్యలు, రోడ్ల మరమ్మతులు వంటి అంశాలపై దృష్టిసారించాలని అధికారులకు సూచించారు. ప్రజలు ఇచ్చే సూచనలతో మున్సిపాలిటీ అభివృద్ధిలో ముందుకు వెళ్తుందని అన్నారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ డీఈ సత్యారావు, శానిటరీ ఇన్‌స్పెక్టర్ సారగండ్ల శ్రీనివాస్, ఏఈ తిరుమలయ్య, ఎండీ గౌసుద్దీన్, అజీముద్దీన్, ఇండ్ల మనోజ్, టీఎంసీ శ్వేత, ఎన్విరాన్‌మెంట్ ఇంజనీర్ శివప్రసాద్, తదితరులు పాల్గొన్నారు.

స్ట్రీట్ ఫుడ్ ఫెస్టివల్.. ప్రొడక్ట్ మేళా

సూర్యాపేట మున్సిపాలిటీలో మెప్మా ఆధ్వర్యంలో మంగళవారం స్ట్రీట్ ఫుడ్ ఫెస్టివల్, ఎస్‌ఎస్‌జీ ప్రొడక్ట్స్ మేళా నిర్వహించారు. స్ట్రీట్ ఫుడ్ ఫెస్టివల్‌లో 17 మంది, ఎస్ఎస్‌జీ ప్రొడక్ట్ మేళాలో 31 మంది పాల్గొన్నారు. వివిధ రకాల వస్తువులు, ఆహార పదార్థాలను తయారు చేసి ప్రదర్శించారు. కార్యక్రమానికి మున్సిపల్ కమిషనర్ హనుమంత రెడ్డి హాజరై మాట్లాడారు. కార్యక్రమంలో డీఈ సత్యారావు, ఆర్వో కళ్యాణి, టీఎంసీ శ్వేత, ఆర్ఐ అబ్దుల్ కదిర్, ఎస్ఎస్ఆర్ ప్రసాద్, ఎన్విరాన్‌మెంట్ ఇంజనీర్ శివప్రసాద్, సీఈఓలు, రోజా, సువర్ణ, ఉమా రాణి, పాపమ్మ, వకుళ, ఆర్పీలు, సంఘం సభ్యులు పాల్గొన్నారు.

పెండింగ్ స్కాలర్‌షిప్‌లు విడుదల చేయాలి



నిరసన తెలుపుతున్న మాదిగ విద్యార్థి సమైక్య సంఘం నాయకులు

సూర్యాపేట : పెండింగ్ స్కాలర్‌షిప్‌లను విడుదల చేయాలని ఎమ్మార్పీఎస్, ఎంఎస్పీ అనుబంధ సంఘం మాదిగ విద్యార్థి సమైక్య ఆధ్వర్యంలో మంగళవారం పట్టణంలో నిరసన కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో మాదిగ విద్యార్థి సమైక్య జిల్లా కన్వీనర్ పండింటి నవీన్ మాదిగ, ఎంఎస్పీ జిల్లా అధ్యక్షుడు యాతాకుల రాజన్న మాదిగ పాల్గొని మాట్లాడారు. ఈ కార్యక్రమంలో ఎమ్మార్పీఎస్ ఎంఎస్పీ నాయకులు చింతలపాటి చిన్న శ్రీరాములు మాదిగ, మారపల్లి సావిత్ర మాదిగ, భాను, గోపి, మనవిఘ్నేష్, రోహిత్, నిఖిల్, వెంకటేష్, సుధీర్, అఖిల్‌కుమార్, విష్ణు, అజయ్ పాల్గొన్నారు.

విద్యార్థులకు దాతలసాయం అభినందనీయం




పెన్‌పహాడ్ : సింగారెడ్డిపాలెంలో విద్యార్థులకు టై, బెల్ట్‌లు అందజేస్తున్న దాత, ఉపాధ్యాయులు

పెన్‌పహాడ్ : విద్యార్థుల విద్యాభివృద్ధికి దాతల సహకారం అభినందనీయమని ఎంఈఓ నకిరేకంటి రవి, కాంప్లెక్స్ ప్రధానోపాధ్యాయుడు మల్లారెడ్డి అన్నారు. సింగారెడ్డిపాలెం గ్రామంలోని ప్రాథమిక పాఠశాలలో విద్యార్థులకు దాత పోరెడ్డి హైమావతి సోమవారం టై, బెల్ట్, ఐడీకార్డు, షూ అందజేశారు. అలాగే ఉపాధ్యాయులకు ఐడీ కార్డులు అందజేశారు. కార్యక్రమంలో హెచ్ఎం బొల్లెద్దు నరేందర్, ఉపాధ్యాయులు నల్లా శ్రీనివాసులు, సరిత, మహేష్, పంచాయతీ కార్యదర్శి అఖిల్, సీఆర్పీలు సైదులు, నాగునాయక్, వహీద్ తదితరులు పాల్గొన్నారు.


తుంగతుర్తి : మండల పరిధిలోని కొత్తగూడెంలో అంకితం చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో మంగళవారం ముక్కాల వెంకటరమణారెడ్డి తన అమ్మమ్మ భీమిరెడ్డి యశోదమ్మ జ్ఞాపకార్థం ప్రాథమిక, ఉన్నత పాఠశాలల్లో విద్యార్థులకు టై, బెల్టు, షూ పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో అంకితం చారిటబుల్ ట్రస్ట్ నాయకులు మల్లు సుధీర్ రెడ్డి, మల్లు కపోతం రెడ్డి, మల్లు ఉపేందర్ రెడ్డి, మల్లు దయాకర్ రెడ్డి, దాచేపల్లి సింగారెడ్డి, గోలి కేశవరెడ్డి, మెంతబోయిన సింహాద్రి, వెంకటేష్, ఆయా పాఠశాలల ప్రధానోపాధ్యాయులు పాటి సుధీర్‌రెడ్డి, శ్రీను, ఉపాధ్యాయులు ప్రభాకర్, వెంకట మల్లు, పర్వీనా, నాగలక్ష్మి, లక్ష్మీబాయి, శారద, ప్రాథమిక పాఠశాల చైర్మన్ పార్వతమ్మ, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులకు క్రీడాదుస్తుల పంపిణీ

నాగారం : విద్యార్థులు దాతలు అందించిన క్రీడాదుస్తులను సద్వినియోగం చేసుకోవాలని మండల విద్యాధికారి వాసం ప్రభాకర్, నాగారం సీఐ డి.నాగేశ్వర్‌రావు అన్నారు. మంగళవారం వర్ధమానుకోట జెడ్పీహెచ్ఎస్‌లో గ్రామానికి చెందిన యారాల రాంరెడ్డి, సైరెడ్డి వెంకట్‌రెడ్డి, ఈదుల యాదగిరి, ఈదుల మురళీల ఆర్థిక సహకారంతో 90 మంది విద్యార్థులకు రూ.30వేల విలువ చేసే స్పోర్ట్స్ దుస్తులను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా దాతలను అధికారులు, ఉపాధ్యాయ బృందం అభినందించారు. కార్యక్రమంలో హెచ్ఎం ఎండీ బురహనోద్దీన్, ఎస్ఐ ఐలయ్య, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.



తుంగతుర్తి : కొత్తగూడెంలో విద్యార్థులకు టై, బెల్ట్, షూ పంపిణీ చేస్తున్న ట్రస్ట్ నాయకులు



నాగారం : వర్ధమానుకోట జెడ్పీహెచ్ఎస్‌లో క్రీడా దుస్తులు పంపిణీ చేస్తున్న అధికారులు

క్షయ వ్యాధి నిర్ధారణ శిబిరం

అర్వపల్లి : క్షయరహిత సమాజం కోసం ప్రతి ఒక్కరూ పాటుపడాలని మండల వైద్యాధికారి డాక్టర్ బి.నగేష్‌నాయక్ కోరారు. మండల పరిధిలోని కొమ్మాల గ్రామంలో మంగళవారం క్షయవ్యాధి నిర్ధారణ శిబిరాన్ని నిర్వహించారు. క్షయ లక్షణాలు కనిపిస్తే వెంటనే వైద్యసిబ్బందిని సంప్రదించాలని సూచించారు. ఈ సందర్భంగా 20 మందికి వైద్యపరీక్షలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో టీబీ నిర్మూలన మండల నోడల్ పర్సన్ కుంభం వీరయ్య, ఎల్‌టీ చొక్కయ్య, ఎంఎల్‌హెచ్‌పీ వక్షిత, హెల్త్ అసిస్టెంట్లు శ్రీనివాస్, సరస్వతి, ఊర్మిళ, ఆశా కార్యకర్తలు కవిత, రోజ, తదితరులు పాల్గొన్నారు.

పరిశుభ్రతపై అవగాహన

ఆత్మకూర్ (ఎస్) : వర్షాకాలం నేపథ్యంలో అంటువ్యాధులు ప్రబలే అవకాశం ఉంటుందని, విద్యార్థులు వ్యక్తిగత పరిశుభ్రత పాటించాలని మండల వైద్యాధికారి మౌనిక అన్నారు. మంగళవారం మండల కేంద్రంలోని ఎస్సీ బాలుర హాస్టల్‌ను ఆమె సందర్శించారు. ఈ సందర్భంగా విద్యార్థులకు పరిశుభ్రతపై అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో సీహెచ్ఓ యాదగిరి, ఏఎస్ఎంలు జి.అన్నపూర్ణ, జె.అన్నపూర్ణ, హెల్త్ అసిస్టెంట్ రాజేంద్రప్రసాద్, ఆశా కార్యకర్తలు కొల్లు మాధవి, పి.నాగమ్మ తదితరులు పాల్గొన్నారు.

సాగునీటి కోసం ఎదురుచూపు

తిరుమలగిరి : గోదావరి జలాల విడుదల కోసం రైతులు ఎదురుచూస్తున్నారని సీపీఎం సీనియర్ నాయకుడు కడెం లింగయ్య తెలిపారు. మంగళవారం ఆయన మండల కేంద్రంలో మాట్లాడారు. సాగు నీటిని అందించకపోతే రైతులు నష్టపోయే ప్రమాదం ఉందని అన్నారు. అంతేకాకుండా సరిపోను యూరియా అందుబాటులేక రైతులు ఇబ్బందులు పడుతున్నారని తెలిపారు. రైతుల సమస్యలను తక్షణమే పరిశీలించాలని, లేదంటే రైతులను సమీకరించి ఆందోళన కార్యక్రమాలు చేపడతామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో సీపీఎం మండల నాయకులు కడారి లింగయ్య, సీపీఎం మండల కమిటీ సభ్యులు చిత్తలూరు సోమయ్య, రాములు, ఎల్లయ్య, అవులయ్య, మూల సత్తయ్య తదితరులు పాల్గొన్నారు.

రైతులు, గిరిజనుల నిరసన

అర్వపల్లి : మండల పరిధిలోని నాన్యతండాలో 100 కేవీ వ్యవసాయ ట్రాన్స్‌ఫార్మర్ తరచూ కాలిపోతుండటంతో పొలాలు ఎండిపోవడంతోపాటు తాగు నీటి సమస్యకు ఇబ్బందులు ఎదురవుతున్నాయని రైతులు మంగళవారం ట్రాన్స్‌ఫార్మర్ వద్ద నిరసన తెలిపారు. నాన్యతండాలోని వ్యవసాయ ట్రాన్స్‌ఫార్మర్‌పై నాన్యతండా, లచ్చిరాంతండాలకు చెందిన 10 వరకు వ్యవసాయ మోటార్ల కనెక్షన్లు, రెండు తండాల రక్షిత మంచినీటి పథకాల బోరు మోటార్ల కనెక్షన్లు ఉన్నాయి. అయితే నెలరోజుల వ్యవధిలో ట్రాన్స్‌ఫార్మర్ ఐదు సార్లకు పైగానే కాలిపోయి అనేక ఇబ్బందులు పడుతున్నామని రైతులు తెలిపారు. తమకు కొత్త ట్రాన్స్‌ఫార్మర్ ఏర్పాటు చేసి ఇబ్బందులు తీర్చాలని ప్రభుత్వాన్ని కోరుతున్నారు. ఈ కార్యక్రమంలో దేశగాని పాపయ్య, గుగులోతు మాణిక్యం, శంకరయ్య, జాటోతు రమేష్, వెంకన్న, మోతిలాల్, అంబాలి, సోమమ్మ, చాల్లి, మానికి, కమ్లి తదితరులు పాల్గొన్నారు.

హామీలు నెరవేర్చాలి

అర్వపల్లి : తెలంగాణ ఉద్యమకారులకు ఎన్నికల ముందు ఇచ్చిన హామీలను స్థానిక సంస్థల ఎన్నికలలోపే నెరవేర్చాలని తెలంగాణ ఉద్యమ సంఘాల ఆకాంక్షల వేదిక రాష్ట్ర కోశాధికారి కుదురుపాక ఉదయ్ కోరారు. మంగళవారం అర్వపల్లిలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. ఎన్నికల ముందు ఇచ్చిన హామీ మేరకు ఉద్యమకారులకు 250 గజాల స్థలం కేటాయించి ఇళ్లను నిర్మించాలని విజ్ఞప్తి చేశారు. గుర్తింపుకార్డులు, నెలకు రూ.25 వేలు పింఛన్ ఇవ్వాలని కోరారు. ఆయన వెంట సంఘం నాయకులు ఉన్నారు.